క్లుప్తంగా

కాలువల్లో పూడికతీత



ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడు శివాలయం సమీపంలో మురుగు కాలువల్లో పొక్లెయిన్‌తో పూడికతీత పనులు శనివారం చేపట్టారు. అనంతరం సిమెంటు పైపుల్లో నిలిచిన మట్టిని శుభ్రం చేయించి అదే ప్రాంతంలో కాలువల్లోకి మురుగునీరు పారే విధంగా పనులు చేయించారు. గతంలో కొద్దిపాటి వర్షం పడినా కాలువల్లో మురుగు చేరి నీటిపారుదల సక్రమంగా ఉండేది కాదని ఇప్పుడు పారేలా పనులు చేయించామని పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు చెప్పారు.

దుర్గమ్మకు ఆషాఢం సారె



తాడేపల్లిరూరల్: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని పాత మంగళగిరి దుర్గానగర్‌లోని శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలోని అమ్మవారికి మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ మన్నెం రమేష్ బాబు, అనిత దంపతుల ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఆషాఢ సారె సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళకు పసుపు, కుంకుమ, తాంబూలాలు అందజేశారు. కార్యక్రమంలో భక్తబృందం ప్రతినిధులు తలశీల జయలక్ష్మి, ఆలూరి వాసంతి, కారంపూడి ఓంకార మూర్తి పాల్గొన్నారు.

వైభవంగా మాసశివరాత్రి పూజలు

ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడులోని విశాలాక్షి, అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామికి శనివారం మాసశివరాత్రి సందర్భంగా విశేషపూజలు నిర్వహించారు. ఉదయాన్నే అర్చకులు రావూరిపూర్ణచంద్రశాస్త్రి స్వామికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

తాడేపల్లిరూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరంలో విద్యుత్‌శాఖ అధికారులు శనివారం లో ఓల్టేజ్ సమస్యను పరిష్కరించేందుకు నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంగళగిరి విద్యుత్ శాఖ ఏడీ అక్కల సత్యనారాయణ మాట్లాడుతూ ఈ మధ్య కాలంలో వడ్డేశ్వరం గ్రామంలో లో ఓల్టేజ్ సమస్యలు ఉన్నాయంటూ ప్రజా దర్బార్‌లో నారా లోకేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన సూచనల మేరకు విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు రూ.8.5 లక్షల వ్యయంతో 63 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు.

వీఆర్‌ఏలకు నైట్ డ్యూటీలు వద్దు

తాడికొండ: వీఆర్‌ఏలకు రాత్రి సమయాల్లో డ్యూటీలు వేయవద్దని రైతాంగ సంఘటన జిల్లా కన్వీనర్ యడ్లపల్లి గాంధీ రామ్మోహనరావు, రైతు సంఘం నాయకులు చింతల భాస్కరరావు కోరారు. శనివారం వీఆర్‌ఏలతో కలిసి తహసీల్దార్ నాసరయ్యకు వినతి పత్రం అందజేశారు.

మేడికొండూరు: వీఆర్‌ఏలకు రాష్ట్ర ప్రభుత్వం నైట్ డ్యూటీ వేయాలనే నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని మండలం వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు వి.బాజీబాబు అన్నారు. పలు రకాల డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని శనివారం మండల తహసీల్దారు పద్మనాభుడికి ఇచ్చారు.

చిరు ఉద్యోగుల తొలగింపు!

తాడికొండ: తాడికొండ నియోజకవర్గంలో టీడీపీ నాయకులు అధికారం అడ్డుపెట్టుకొని ప్రతాపం చూపిస్తున్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో 9 మంది వీఏలను నిబంధనలకు విరుద్ధంగా తొలగించగా 10 మందికి పైగా పంచాయతీ కార్మికులు, 4 ఫీల్డ్ అసిస్టెంట్‌లు, రేషన్ డీలర్ల తొలగింపునకు రంగం సిద్ధం చేశారు. ఇప్పటికే పలువురిని తొలగించగా మరికొందరిని తొలగించే ప్రక్రియ కొనసాగుతోంది. ఎమ్మెల్యే కార్యాలయం నుంచి అధికారులకు హుకుం కూడా జారీ అవుతుండటంతో చేసేదేమీ లేక అధికారులు కూడా వత్తాసు పలుకుతున్నారు.

రైస్‌మిల్లుల్లో తనిఖీలు

మేడికొండూరు: మండల పరిధిలోని పేరేచర్లలోని రైస్‌మిల్లుల్లో శనివారం తహసీల్దారు పద్మనాభుడు, సివిల్ సప్లయి ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్ తనిఖీలు చేశారు. మిల్లులో 623 క్వింటాళ్ల బియ్యం బస్తాలు స్వాధీనం చేసుకున్నారు. మిల్లును సీజ్ చేస్తున్నట్లు తెలిపారు.

అవగాహనతోనే పరిహారం

- జీవాలకు పెరుగుతున్న విద్యుత్ ప్రమాదాలు
- అవగాహన లేక నష్టపోతున్న పాడి రైతులు

తాడేపల్లి రూరల్: వర్షాలు, తుఫాన్ సమయంలో ప్రమాదవశాత్తు పశువులు విద్యుత్ ఘాతానికి గురవుతుంటాయి. రూ.లక్షలు విలువ చేసే ఎద్దులు, పాడి పశువులు అక్కడికక్కడే మృతి చెందిన దాఖలాలు కూడా ఉన్నాయి. అలాగే వర్షాలు, ఈదురు గాలులు, తుఫాన్‌ల సమయంలో విద్యుత్ తీగలు తెగి కింద పడుతుంటాయి. వీటిని గమనించకపోవడంతో కొందరు ప్రాణాలు కోల్పోతుండగా అనేక మంది క్షతగాత్రులవుతున్నారు. ప్రమాదాల్లో నష్టపోయిన బాధిత కుటుంబాలకు విద్యుత్ శాఖ పరిహారం అందించి ఆదుకుంటుంది. అయితే ఈ పరిహారంపై బాధితులకు అవగాహన లేకపోవడంతో చాలామంది నష్టపోతున్నారు.

ఇలా చేయాలి.....

విద్యుత్ ప్రమాదం జరిగిన వెంటనే పరిహారం కోసం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయాలి. కేసు నమోదు అయిన తర్వాత శవ పంచనామా చేయించాలి. పరిహారం పొందేందుకు కేసుకు సంబంధించిన పత్రాలతో విద్యుత్‌శాఖ సహాయక ఇంజినీర్(ఏఈ)కి దరఖాస్తు చేసుకోవాలి. మరణ ధ్రువీకరణ పత్రం, ఎఫ్ఐఆర్, పంచనామా నివేదిక, ఆధార్, బ్యాంక్ పుస్తకం తదితర కాపీలను జత చేసి విద్యుత్ ఏఈకి అందజేయాలి. ఏఈ నుంచి ఆ పత్రాలు ఏడీఈకి చేరుతాయి. ఆ పత్రాలు ఉన్నతాధికారులకు అందిన తర్వాత నష్టపరిహారం బాధితుల బ్యాంకు ఖాతాలో జమ అవుతుంది.



విద్యుదాఘాతానికి గురై ప్రాణాలు కోల్పోయిన గేదె(ఫైల్)

వ్యక్తులకు అంగవైకల్యం కలిగితే...

విద్యుత్ ప్రమాదం వల్ల అంగవైకల్యం కలిగితే ప్రమాద విషయాన్ని వెంటనే విద్యుత్ శాఖాధికారులకు తెలియజేయాలి. వైద్యం నిమిత్తం అయిన ఖర్చు బిల్లులు, ఇతర ఖర్చుల వివరాలు సంబంధిత ధ్రువీకరణ పత్రాలు దరఖాస్తుకు జత పరచి విద్యుత్ శాఖ ఏఈకి అందించాలి. ఉన్నతాధికారులు వాటిని పరిశీలించి నష్టపరిహారం మంజూరు చేస్తారు.

మూగ జీవాలు మృతి చెందితే....

పశువులు, విద్యుత్ ఘాతానికి గురై మృతి చెందితే ముందుగా సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు, వీఆర్‌ఓ, తహసీల్దార్‌కు సమాచారం అందించాలి. పశువైద్యాధికారి నుంచి పశువు ఖరీదు తెలిపే పత్రం, మృతి చెందినట్లు ధ్రువీకరణ పత్రం తీసుకోవాలి. మృతి చెందిన పశువు నిమిత్తం పరిహారం బాధితుడికి అందిస్తారు. పశు వైద్యులు సూచించిన మేరకు నష్టపరిహారం అందుతుంది.

అర్హులకు వెంటనే పరిహారం....



విద్యుత్ ప్రమాదాలకు సంబంధించిన బాధిత కుటుంబాలు అర్హులైతే పరిహారం తప్పకుండా అందుతుంది. ప్రమాదం జరిగిన స్థాయిని బట్టి పరిహారం ఉంటుంది. నిబంధనల ప్రకారం అన్ని ధ్రువీకరణ పత్రాలు ఉండాలి. మూగ జీవాల విషయంలో పశు వైద్యాధికారి ఇచ్చే ధ్రువీకరణ పత్రాన్ని పరిగణలోకి తీసుకుంటాం. విద్యుత్ ప్రమాదాల బారిన పడిన వెంటనే అధికారులకు తెలియజేయాలి. గ్రామాల్లో కూడా సిబ్బందితో ప్రజలకు అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నాం.

–షణ్ముఖ, ఏఈ, నులకపేట సబ్‌స్టేషన్

కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరు సాగిస్తాం

తాడేపల్లి రూరల్: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న మతోన్మాద, ప్రజా వ్యతిరేక నిరంకుశ విధానాలపై నిరంతరం పోరు కొనసాగిస్తామని సీపీఐ మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య అన్నారు. శనివారం మంగళగిరిలో సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పట్టణ కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా చిన్ని తిరుపతయ్య మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రజా వ్యతిరేక నిరంకుశ విధానాలను అమలు చేస్తోందని, దేశంలో మతోన్మాద బీజేపీ మతాల మధ్య, కులాల మధ్య చిచ్చులు పెడుతోందని మండిపడ్డారు. అమరావతి రాజధాని నిర్మాణానికి పూర్తిస్థాయిలో నిధులు విడుదల చేయాలని, పోలవరం పూర్తి అయ్యే వరకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్, సీపీఐ పట్టణ కార్యదర్శి నందం బ్రహ్మేశ్వరరావు, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని సత్యనారాయణ, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గండికోట దుర్గారావు, ఇందిరానగర్ కార్యదర్శి ఉడత శ్రీనివాసరావు, దొడ్డి ఈశ్వరరావు, గంజి వెంకయ్య, వల్లభాపురం నాగేశ్వరరావు, ఉయ్యాల సత్యనారాయణ, కాకర్ల నరసింహారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య

తుమ్మపూడిలో కొనసాగుతున్న వైద్య శిబిరం

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని తుమ్మపూడిలో వారం రోజుల నుంచి జ్వరాల విజృంభిస్తున్నాయి. ప్రతి ఇంట్లో జ్వరాలు వచ్చి ఇళ్లకే పరిమితం కావడంతో దుగ్గిరాల ప్రభుత్వ వైద్యశాల ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. శనివారం రెండో రోజు కూడా తుమ్మపూడిలో డాక్టర్ అబ్దుల్ రహమాన్ పరీక్షలు నిర్వహిస్తుండగా గ్రామ సర్పంచి షేక్ అజీజున్ వైద్యులతో పాటు ప్రతి ఇంటికి వెళ్లి వారి ఆరోగ్యపరిస్థితి తెలుసుకుంటున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ షేక్ అజీజున్ మాట్లాడుతూ తుమ్మపూడిలో ఇప్పటి వరకు సాధారణ జ్వరాలే నమోదు అయ్యాయని, దుగ్గిరాల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో జ్వరాల బారిన పడిన వారికి డెంగీ, మలేరియా పరీక్షలు నిర్వహిస్తున్నారని చెప్పారు. ఇప్పటి వరకు సాధారణ జ్వరాలేనని, జ్వరం వచ్చిన ప్రతి ఒక్కరూ వైద్యులు ఇచ్చిన మందులు వేసుకుంటూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని చెప్పారు. వైద్య శిబిరంలో తెనాలి ఉప జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ ఇ.అన్నపూర్ణ, దుగ్గిరాల మండల అభివృద్ధి అధికారి బి.భార్గవి, పంచాయతీ విస్తరణ ధికారి శ్రీనివాసరావు, డాక్టర్ ఇందిర పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

విద్యార్థులకు కెరీర్‌పై అవగాహన

తాడేపల్లిరూరల్: పట్టణ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ మహానగర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు భవిష్యత్ కెరీర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. క్లబ్ సభ్యులు అన్నపురెడ్డి కోటిరెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సెల్ఫ్ కాన్ఫిడెన్స్‌ను పెంపొందించుకోవాలని సూచించారు. కాలం అమూల్యమైనదని, దానిని వృథా చేసుకుంటే తిరిగి రాదని వివరించారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం మాటల్లో కలలు కనండి.. కలలు సాకారం చేసుకోవడానికి కృషి చేయాలని కోరారు. విద్యలో సమున్నత స్థానం కోసం కష్టపడి చదవాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు తాతిరెడ్డి, ఉపాధ్యాయులు కాకుమాను జోజప్ప పాల్గొన్నారు.

కార్పొరేషన్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

తాడేపల్లి రూరల్: మంగళగిరి– తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ప్రజల సమస్యల పరిష్కారం కోసం నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంటీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్ 7093912653కు వార్డు శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలతో పాటు ఇతర సచివాలయ సిబ్బంది మూడు షిఫ్టులుగా డ్యూటీలు కేటాయించామని, మీ ప్రాంతంలో నీరు రంగు మారటం, వీధులు పరిశుభ్రంగా లేకపోవడం వంటివి గుర్తిస్తే తక్షణమే సంబంధిత సచివాలయంపై కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేసి సమస్యను తెలియజేయాలని, పరిష్కరించుకునే దిశగా చర్యలు చేపడతామని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

తాడేపల్లిరూరల్: గుంటూరు జిల్లా దుగ్గిరాల గ్రామంలో శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్ అగ్నిప్రమాద బాధిత రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్ అగ్నిప్రమాద బాధిత రైతుల సంఘం కన్వీనర్ వేములపల్లి వెంకటరామయ్య డిమాండ్ చేశారు. శనివారం ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరంలో ప్రజా సంఘాల కార్యాలయంలో రైతు సంఘం నాయకులు ములకా శివసాంబిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా వెంకటరామయ్య మాట్లాడుతూ జనవరి 19న దుగ్గిరాలలోని శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో 360 మంది పసుపు రైతులు లక్ష నాలుగు వేల బస్తాలు అగ్నికి ఆహుతి అయ్యాయని, బాధిత రైతులకు న్యాయం చేయాలని గత ఆరు నెలలుగా అనేక పోరాటాలు, ఆందోళనలు చేస్తున్నామని, జూలై 10వ తేదీన ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెం నాయుడు, వేమూరు నియోజకవర్గం ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు సమక్షంలో కోల్డ్ స్టోరేజ్ యాజమాన్యం, ప్రభుత్వ అధికారులు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం బృందం చర్చల ఫలితంగా క్వింటాకు 7 వేల రూపాయలు చెల్లిస్తామని ఒప్పందం చేశారని అన్నారు. ఒప్పందం ప్రకారం రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర నాయకులు ఎం.సూర్యనారాయణ, పసుపు రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ జొన్నా శివశంకరరావు, కె.రామస్వామి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటరామయ్య

తల్లిపాలతో బిడ్డలకు ఆరోగ్యం

ఫిరంగిపురం: తల్లిపాలతో చిన్నారులకు ఆరోగ్యం చేకూరుతుందని సీహెచ్‌ఓ లింగరాజు అన్నారు. మండలంలోని మునగపాడు అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా చిన్నారుల తల్లులకు తల్లిపాల విశిష్టత గురించి వివరించారు. తల్లిపాలు బిడ్డకు తొలి టీకా వంటిదని చెప్పారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం పాపులమ్మ, అంగన్‌వాడీ మేరి, ఆశ కార్యకర్తలు రమణ, అరుణ పాల్గొన్నారు.

వైభవంగా పెరియమ్మ తిరునాళ్ల

ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడులోని వెంకటసాయి క్వారీవద్ద ఉన్న మారియమ్మ, పెరియమ్మ అమ్మవార్ల ఆలయ వార్షిక తిరునాళ్లను శనివారం భక్తులు వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే భక్తులు పసుపునీటి బిందెలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవార్లకు జలాభిషేకాలు నిర్వహించారు. అనంతరం కుంకుమతో పూజలు చేసి పొంగళ్లుపొంగించి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు.

ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

తాడేపల్లిరూరల్: కార్పొరేషన్ పరిధిలో తాడేపల్లి పట్టణ పరిధిలో క్రిస్టియన్‌పేట, ముగ్గురోడ్డులో అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంగళగిరి సిడిపివో సులోచన విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె తల్లిపాల ప్రాముఖ్యత, తల్లి పాలు బిడ్డకు ఎంత అవసరమో తల్లులకు వివరించారు. గర్భిణులు, బాలింతలకు తల్లిపాట ప్రాముఖ్యాన్ని వివరించారు. క్రిస్టియన్‌పేటలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాల్లో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జి.భవాని, అంగన్‌వాడీ కార్యకర్తలు జె.రవణమ్మ, ఎ.వెంకటేశ్వరమ్మ, ఏఎన్‌ఎం నాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీలో పాల్గొన్న మంగళగిరి సీపీడీఓ సులోచన తదితరులు

మహిళలకు కుట్టు మిషన్లు అందజేత

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల గ్రామంలో కుట్టు మిషన్ శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలకు శనివారం ఉచితంగా కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమాన్ని మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం ఎమ్మెస్సెస్ భవన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలుగు మహిళా అధ్యక్షురాలు ఆరుద్ర భూలక్ష్మి విచ్చేసి మహిళలకు కుట్టు మిషన్లు అందజేశారు. ఆమె మాట్లాడుతూ శిక్షణ పొందిన 60 మంది మహిళలకు ఉచితంగా మిషన్లు అందజేశామని అన్నారు. రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీ దేవి మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ దుగ్గిరాల మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, మంగళగిరి నియోకవర్గం తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మంచికలపూడి వైష్ణవి, నాయకులు యాళ్ల జయలక్ష్మి, తోట భూలక్ష్మి, అలేఖ్య పాల్గొన్నారు.



శిక్షణ పొందిన మహిళలకు కుట్టు మిషన్లు అందజేస్తున్న దృశ్యం

కాలుష్య రహిత దేశంగా భూటాన్

అస్సాం అగ్రికల్చర్ యూనివర్సిటీ అధ్యాపకుడు ప్రొఫెసర్ ఎల్లా రత్తయ్య

ఏఎన్‌యూ: ప్రపంచంలో కాలుష్య రహిత దేశంగా భూటాన్ ఉందని, అక్కడ 70 శాతం అటవీ ప్రాంతం ఉందని అస్సాం అగ్రికల్చర్ యూనివర్సిటీ అధ్యాపకుడు ప్రొఫెసర్ ఎల్లా రత్తయ్య తెలిపారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ బోటనీ, మైక్రో బయాలజీ విభాగం ఆధ్వర్యంలో 'ట్రీస్ విస్ గ్లోబల్ వార్మింగ్ అండ్ క్లైమేట్ చేంజ్' అనే అంశంపై శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన కీలకోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆచార్య రత్తయ్య ప్రసంగిస్తూ గ్లోబల్ వార్మింగ్ అనేది సీవో-2లో మార్పులు పెరగటం వల్ల వస్తుందన్నారు. ప్రస్తుతం కార్బన్ ఫుట్ ప్రింట్స్ వల్ల కార్బన్ డయాక్సైడ్ తగ్గించవచ్చని తెలిపారు. అమెరికా అధికంగా గ్లోబల్ వార్మింగ్‌కి కారణం అవుతోందని వెల్లడించారు. 2070కి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నెట్ జీరో లేదా సీవో-2 పొల్యూషన్ రహిత దేశంగా భారతదేశాన్ని నిలిపేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారని చెప్పారు. ప్రస్తుత పరిస్థితులలో జపాన్‌కి చెందిన అకిరా మియా వకీ మెథడ్‌ని అనుసరించి తాను ఎక్కువ లేయర్స్ రకాలైన మొక్కలను గుంటూరులోని కొరటిపాడు ట్యాంక్, వాకింగ్ ట్రాక్ లో ఏర్పాటు చేయించానని తెలిపారు. ముఖ్య అతిథిగా హాజరైన వీసీ గంగాధరరావు మాట్లాడుతూ మొక్కల పెంపకంలో ఆచార్య రత్తయ్యను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. వీరయ్య పర్యావరణ సంరక్షణలో మొక్కల పాత్రను వివరించారు. ఎన్విరాన్మెంటల్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ బ్రహ్మాజీరావు గ్లోబల్ వార్మింగ్ అండ్ క్లైమేట్ చేంజ్ పైన, జాతీయ, అంతర్జాతీయ రెగ్యులేషన్స్‌ను వివరించారు. సదస్సు నిర్వహణ ఉద్దేశాన్ని విభాగాధిపతి ఆచార్య మల్లికార్జున తెలిపారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రత్తయ్యను సన్మానిస్తున్న వీసీ తదితరులు

కేసులు ఎత్తివేయాలి

గుంటూరు మెడికల్: రాజధాని ఉద్యమంలో పెట్టిన కేసులను ఎత్తివేయాలని అమరావతి రైతు ఐక్యకార్యాచరణ సమితి అధ్యక్షుడు మాదల శ్రీనివాసు అన్నారు. శనివారం గుంటూరు చంద్రమౌళి నగర్‌లో విలేకరుల సమావేశంలో అమరావతి ఉద్యమంలో అసువులు బాసిన వారికి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన మాట్లాడుతూ అమరావతి రాజధాని అభివృద్ధి కోసం నిధులు మంజూరు విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సానుకూలంగా ఉండటం శుభపరిణామమని పేర్కొన్నారు. సమావేశంలో అమరావతి రైతు ఐక్య కార్యాచరణ సమితి సభ్యులు ధనేకుల రామారావు, బెల్లంకొండ నరసింహారావు, కొమ్మినేని సత్యనారాయణ, చలపతిరావు, బాలమురళి, జమ్ముల శ్యాంకిషోర్, సతీష్ కొండపాటి, రాజేంద్ర పాల్గొన్నారు.

ఎముకలు కీలుకం

- ప్రతి ఏడాది పెరుగుతున్న ఆర్థోపెడిక్ సమస్యలు
- ఆధునిక జీవనశైలితో యుక్త వయస్సులోనే కీళ్ల సమస్యలు

నేడు బోన్ అండ్ జాయింట్ డే

గుంటూరు మెడికల్: మనిషి నిలబడాలన్నా.. కూర్చోవాలన్నా.. పరుగెత్తాలన్న ఏదైనా పనులు చేయాలన్నా.. ఎముకలు పటిష్టంగా ఉంటేనే సాధ్యమవుతోంది. ఆధునిక జీవన శైలి వలన ప్రతిఏడాది ఆర్థోపెడిక్ సమస్యల బారిన పడుతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరిగిపోతుంది. ఆర్థోపెడిక్ సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఇండియన్ ఆర్థోపెడిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2012 నుంచి భారతదేశంలో బోన్ అండ్ జాయింట్ డే ను నిర్వహిస్తున్నారు.

సమస్యలకు కారణం..

ఆధునిక జీవన శైలి వలన ఎక్కువ మంది ఏసీలకే పరిమితమై కొంత సేపు కూడా సూర్యరశ్మి సోకకుండా గదుల్లోనే ఉండి పోతున్నారు. దీంతో విటమిన్ డీ లోపంతో ఎముకల పటుత్వం తగ్గిపోతోంది. ఫాస్ట్‌ఫుడ్స్ ఎక్కువగా తీసుకోవడం, వ్యాయామం చేయకపోవడం ద్వారా కూడా ఒబెసిటి పెరిగిపోయి ఆర్థోపెడిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. వయస్సు పైబడిన వారు సహజ సిద్ధంగా తమ శరీరంలో తగ్గిపోయే కాల్షియంను తిరిగి భర్తీ చేసుకోకుండా నిర్లక్ష్యం చేయడం ద్వారా పెద్దవారిలో ఆర్థోపెడిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. స్మోకింగ్ కూడా కాల్షియం పెరగకుండా ఎముకల అరుగుదలకు కారణమవుతోంది. జిల్లా వ్యాప్తంగా ఆర్థోపెడిక్ సర్జన్లు 350 మంది ఉన్నారు. ప్రతిరోజూ ఒక్కో వైద్యుడి వద్ద 50 మంది వివిధ రకాల సమస్యలతో చికిత్స పొందుతున్నారు.




బోన్ అండ్ జాయింట్ డే పోస్టర్లు

జీజీహెచ్‌లో ఉచితంగా కార్పొరేట్ వైద్యం..

గుంటూరు జీజీహెచ్‌లో ఆర్థోపెడిక్ సమస్యలకు సోమవారం నుంచి శనివారం వరకు ప్రతిరోజూ ఓపీ విభాగంలో ఉచిత సేవలందిస్తున్నారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి క్యాజువాలిటీలో 24 గంటలూ వైద్యులు అందుబాటులో ఉండి, ఆపరేషన్లు చేస్తున్నారు. కార్పొరేట్ ఆస్పత్రుల కంటే దీటుగా అత్యాధునిక మాడ్యూలర్ ఆపరేషన్ థియేటర్లు, సీఆర్మ్ వైద్య పరికరాలతో ఆపరేషన్లు ఉచితంగా చేస్తున్నారు. ప్రతిరోజూ 300 మంది ఓపీ విభాగంలో వైద్య సేవలు పొందుతున్నారు. ప్రతిరోజూ సాధారణ, ఎమర్జెన్సీ ఆపరేషన్లు పదికి పైగా చేస్తున్నారు.


యుక్తవయస్సులోనే కీళ్ల అరుగుదల



వయస్సు పెరిగే కొద్ది జాయింట్లు అరిగిపోవడం సహజంగా జరుగుతోంది. కానీ ఆధునిక జీవనశైలి వల్ల యుక్తవయస్సులోనే కీళ్లు అరిగిపోతున్నాయి. కీళ్ల అరుగుదలను ముందస్తుగా గుర్తిస్తే ఆపరేషన్‌తో పనిలేకుండా తగ్గించవచ్చు. బీఎంఆర్ హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్టుకు చెందిన ఉన్నతి ఫౌండేషన్ ద్వారా గతంలో గుంటూరు జీజీహెచ్‌లో సుమారు వంద మందికి ఉచితంగా మోకీలు మార్పిడి ఆపరేషన్లు చేశాం. తెలుగు రాష్ట్రాల్లో అనేక గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ ద్వారా ప్రభుత్వ ఉద్యోగులకు, హెల్త్ ఇన్సూరెన్సు కార్డుల ద్వారా సాధారణ ప్రజలకు ఉచితంగా మోకీలు మార్పిడి ఆపరేషన్ చేస్తున్నాం.

– డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి, సీనియర్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, గుంటూరు

జాగ్రత్తలతో ఎముకలు పదిలం



బోన్ అండ్ జాయింట్ డేను పురస్కరించుకుని క్యాల్షియం ఆవశ్యకత గురించి, రోడ్డు ప్రమాదాల్లో ప్రథమ చికిత్సపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఎముకలు బలంగా ఉండాలంటే ప్రతిరోజూ తప్పనిసరిగా సమీకృత ఆహారం తీసుకోవాలి. గుడ్డు, పాలు, రాగిజావ, పాలకూర ఆహారంతో పాటు ప్రతిరోజూ వ్యాయామం చేయాలి. ఊబకాయం లేకుండా చూసుకోవాలి. జంక్‌ఫుడ్, స్మోకింగ్‌కు దూరంగా ఉండాలి. మహిళలు 40 ఏళ్లు దాటితే తప్పనిసరిగా ఎముకల ఆరోగ్యంపై దృష్టి సారించి ప్రత్యేక ఆహారం తీసుకోవాలి.

– డాక్టర్ జి.నరేష్‌బాబు, సీనియర్ స్పైన్ సర్జన్, గుంటూరు

రైతులకు కౌలు పెంపుదలపై హర్షం

తాడికొండ: రాజధాని రైతులకు వార్షిక కౌలు ఐదేళ్ల వరకు పెంచడం హర్షణీయమని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ పేర్కొన్నారు. తుళ్లూరు మండలం వెంకటపాలెం టీటీడీ శ్రీ వెంకటేశ్వరస్వామి స్వామిని శనివారం సందర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చి రెండు నెలలు మాత్రమే అవుతుందని, రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి గాడిలో పడాలంటే ఆరు నెలల సమయం కావాల్సి ఉందని చెప్పారు. ఎస్సీ వర్గీకరణ సామాజిక న్యాయ చరిత్రలో ఒక చారిత్రాత్మక విషయమని, వర్గీకరణ కోసం చాలామంది కృషి చేశారని, మందకృష్ణ మాదిగ నాయకత్వంలో 30 ఏళ్లుగా ప్రజా ఉద్యమం నిర్వహించినట్లు పేర్కొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలు

తాడికొండ: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరు గాయపడిన తాడికొండ మండలం లాం గ్రామ చప్టా వద్ద శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. గుంటూరు నుంచి తాడికొండ వైపు వస్తున్న వాహనాన్ని ఫూటుగా మద్యం తాగి వెళుతున్న యువకుడు ఎదురుగా వచ్చి బలంగా ఢీకొట్టాడు ఈ ఘటనలో స్కూటీపై వెళుతున్న వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా ఇద్దరినీ 108లో ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు తాడికొండ పోలీసులు తెలిపారు.